మొక్కుబడిగా



మధురానగర్ హైస్కూల్‌లో కొత్తగా చేరిన ఉపాధ్యాయులతో సమావేశమైన హెచ్‌ఎం లక్ష్మీనరస



మధురానగర్ హైస్కూల్‌లో విద్యార్థుల సందడి

- పాఠశాలలు ప్రారంభం
- పంపిణీ కాని పాఠ్య పుస్తకాలు
- యూనిఫారాలు , బూట్లు, టైలు, సాక్సులదీ అదే పరిస్థితి
- తొలిరోజు పంపిణీలో విఫలమైన యంత్రాంగం

సీతంపేట: వేసవి సెలవులు ముగియడంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. కొత్త పుస్తకాలు, బ్యాగులతో విద్యార్థులు ఉత్సాహంగా బడి వైపు అడుగులు వేశారు. పిల్లలను స్కూల్ వద్ద దింపేందుకు వచ్చిన తల్లిదండ్రులు, ఆటోలతో స్కూళ్ల వద్ద సందడి నెలకొంది. తొలిరోజు మూడొంతుల మంది విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యారు. మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్, మధురానగర్ ప్రాథమిక పాఠశాల, అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, ముస్లిం తాటిచెట్లపాలెంలోని ఉర్దూ హైస్కూల్లో తొలిరోజు విద్యార్థుల సందడి కనిపించింది. చాలా రోజుల తర్వాత కలుసుకోవడంతో విద్యార్థులు తమ స్నేహితులతో ముచ్చటిస్తూ కన్పించారు. వేసవి సెలవులు ఏ విధంగా గడిపారో ఒకరికొకరు తెలుసుకున్నారు.

పంపిణీ కాని పాఠ్య పుస్తకాలు..

జీవీఎంసీ పాఠశాలల్లో తొలిరోజు పాఠ్యపుస్తకాల పంపిణీ జరగలేదు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునః ప్రారంభం నాటికి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫారాలు , బూట్లు, టైలు, సాక్సులు సిద్ధం చేస్తామని చెప్పిన యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. ఎస్‌ఆర్‌కే కిట్స్ అన్ని పాఠశాలలకు చేరుకున్నప్పటికీ తొలిరోజు పంపిణీ చేయలేదు. శుక్రవారం పుస్తకాలు పంపిణీ చేయనున్నట్టు హెచ్‌ఎంలు తెలిపారు. బూట్లు రాకపోవడంతో తర్వాత పంపిణీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్టు సమాచారం. ఇటీవల జరిగిన బదిలీలతో దాదాపు అన్ని పాఠశాలల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కొత్తవారు బాధ్యతలు చేపట్టారు. కొత్తవారు రావడంతో పాఠశాలపై అవగాహన రావాల్సి ఉంది.

పెరిగిన టీచర్లు..

మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్లో ఇప్పటి వరకు 73 మంది విద్యార్థులు కొత్తగా జాయిన్ అయినట్టు హెచ్‌ఎం లక్ష్మీ నరస తెలిపారు. గతంలో 19 మంది టీచర్లు ఉండేవారని, ఇటీవల జరిగిన బదిలీల్లో ముగ్గురు తప్ప అందరూ కొత్తవారు వచ్చారు. వీరికి అదనంగా ఒక పీఈటీ పోస్టు, ఒక తెలుగు టీచర్ పోస్టు మంజూరయ్యాయి. అయితే తెలుగు, పీఈటీలు ఇంకా జాయిన్ కాలేదు. ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో ఇప్పటి వరకు 27 మంది కొత్తగా జాయిన్ అయిట్టు హెచ్‌ఎం రాధాకుమారి తెలిపారు. గతంలో 14 మంది టీచర్లు ఉండగా బదిలీల్లో కొత్తగా మరో ముగ్గురు టీచర్లు పెరిగారు. మధురానగర్ ప్రైమరీ స్కూల్లో 26 మంది విద్యార్థులు కొత్తగా జాయిన్ అయినట్టు హెచ్‌ఎం దేముడుబాబు తెలిపారు. కొత్తగా చేరిన ఉపాధ్యాయులతో హెచ్‌ఎంలు సమావేశమై పాఠశాల, తరగతుల నిర్వహణపై చర్చించారు.



ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో కొత్తగా చేరిన టీచర్లతో హెచ్‌ఎం రాధాకుమారి



మధురానగర్ హైస్కూల్‌లో మధ్యాహ్నం భోజనం చేస్తున్న విద్యార్థులు

ఉత్తరాధికారికి ఘన స్వాగతం



దత్తేశ్వరానంద భారతీ స్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న పురోహితులు

సీతంపేట: కుర్తాళం, శ్రీలలితా పీఠం ఉత్తరాధికారిగా పట్టాభిషిక్తుడైన దత్తేశ్వరానంద భారతీ స్వామి మొదటి సారిగా అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠానికి గురువారం విచ్చేశారు. ఈ సందర్భంగా స్వామికి ఆలయ అర్చకులు, పురోహితులు, వేదమంత్రాలు, మేళాతాళాలు, పూర్ణ కుంభంతో ఘనస్వాగతం పలికారు. ముందుగా రామలింగేశ్వరాలయం నుంచి పీఠం వరకు భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం లలితా పీఠంలో అర్చకులు, పురోహితులు, వేదపండితులు, భక్తులను భారతీ స్వామిఆశీర్వదించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన దురదృష్టకరం

మద్దిలపాలెం: గుజరాత్ అహ్మదాబాద్‌లో గురువారం మధ్యాహ్నం జరిగిన విమాన ప్రమాద ఘటన అత్యంత దురదృష్టకరమని బీజేపీ నాయకుడు, బీసీ నేత మూల వెంకటరావు ఒక ప్రకటనలో ఆవేదన వెలిబుచ్చారు. అహ్మదాబాద్ నుంచి బయలుదేరిన కొన్ని నిమిషాల్లోనే విమానం ప్రమాదానికి గురై కుప్పకూలడం, అందులో వందల మంది ప్రయాణికులు మృత్యువాత పడటం విచారకరమని పేర్కొన్నారు. ప్రమాదానికి గురైన విమానం బీజే మెడికల్ కాలేజీపై పడి కొందరు విద్యార్థులు దుర్మరణం చెందడంపై విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మృత్యువాత పడటం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మురళీనగర్: జోన్–2 డివిజన్ అయ్యప్పనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వర్మ కాంప్లెక్స్, వాకర్స్ పార్కు, స్పెన్సర్స్, చర్చి, ఎన్‌జీజీవోస్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

జాతీయ ఉపకార వేతనానికి విద్యార్థుల ఎంపిక



ఎ.అఖిల | పి. సంజన

సీతంపేట: జాతీయ ఉపకార వేతన పరీక్ష (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్) 2024–25కు సంబంధించి మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. 8వ తరగతి చదువుతున్న ఎ.అఖిల, పి. సంజన స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారు. వీరికి 9, 10, ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాలకు ఏడాదికి రూ.12 వేలు చొప్పున కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఉపకార వేతనం ఇవ్వనున్నట్లు పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనరస తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం విద్యార్థులను అభినందించారు.

పింఛన్ ఇప్పించండి మహాప్రభో!

ఏడాది కాలంగా సచివాలయం చుట్టూ మహిళ ప్రదక్షిణలు



పింఛన్ మంజూరు చేయాలని వేడుకుంటున్న చోటీ బీబీ

అల్లిపురం: భర్త చనిపోయాడు.. కూతురు పెళ్లీడుకు వచ్చింది.. కుమారుడికి సరిగ్గా కనిపించదు.. ఆదాయం అంతంత మాత్రమే.. కాస్త కనికరించి పింఛన్ ఇప్పించండి మహా ప్రభో అంటూ జీవీఎంసీ 34వ వార్డు అచ్చియ్యమ్మపేటకు చెందిన చోటీ బీబీ వేడుకుంటోంది. తమకు ఒక్కపూట భోజనం కూడా కష్టంగా ఉందని, బతుకు వెళ్లదీయటం కష్టంగా ఉందని ఆమె గత ఏడాది కాలంగా అచ్చియ్యమ్మపేట సచివాలయ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తోంది. అయినప్పటికీ తమను ఎవరూ కరుణించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది. కొత్త పింఛన్ కోసం దరఖాస్తు చేద్దామంటే ఇప్పుడు కాదని చెబుతున్నారని ఆమె వాపోతోంది. కేవలం రేషన్ బియ్యంతోటే బతుకు వెళ్లదీస్తున్నామని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త పింఛన్ మంజూరు చేయాలని ఆమె చేతులు జోడించి వేడుకుంటోంది.

నేటి నుంచి ఇగ్నో టెర్మ్ ఎండ్ ఎగ్జామ్స్

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ టెర్మ్ ఎండ్ ఎగ్జామ్స్ గురువారం నుంచి ప్రారంభమైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తరఫున ఇగ్నో కో ఆర్డినేటర్ డాక్టర్ కేఎల్ శిరీష తెలిపారు. హాల్ టికెట్లు https:// ignou. samarthi. edu. in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. అలాగే వచ్చే నెల 19 వరకు టీఈఈ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసాలు



ఆరిలోవ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయిస్తున్న టీచర్లు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నెహ్రూనగర్, ఆరిలోవ కాలనీ, వివేకానందనగర్, సంతపాలెం తదితర ప్రాంతాల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో టీచర్లు అక్షరాభ్యాసాలు జరిపించారు. ఆరిలోవ నెహ్రూనగర్‌లోని రాజేంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్లు కామేశ్వరి, అన్నపూర్ణ చిన్నారులచే అక్షరాలు దిద్దించారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి, ఇక్కడ అందిస్తున్న ఆటపాటలతో కూడిన విద్యాబోధనను సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో పలు అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఐఎం బీ స్కూల్‌లో ముగిసిన వర్క్‌షాప్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని ఐఐఎం బిజినెస్ స్కూల్ వేదికగా మూడు రోజులుగా పలు అంశాలపై నిర్వహించిన కార్యశాలలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు 'రోల్ ఆఫ్ అకాడమియా ఇన్ మేకింగ్ ఫ్యూచర్ వర్క్ స్పెస్ రెడీ' అనే అంశంపై వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా ఐఐఎం బీ స్కూల్ డైరెక్టర్ జనరల్ ఆచార్య కృష్ణమోహన్ మాట్లాడుతూ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ సహకారంతో ఈ సెషన్ నిర్వహించినట్లు తెలిపారు. బాలికలు, మహిళలు ఉన్నత విద్య అందిపుచ్చుకోవాల్సిన ఆవశ్యకత, భవిష్యత్తులో సీఈవోలు, బిజినెస్ మేనేజర్లుగా వారు పోషించనున్న క్రియాశీలక పాత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ లీడ్ డాక్టర్ టి.వసుధ, సంస్థ డీన్ డాక్టర్ సుంకరి రవీంద్ర, ఐఐఎం బీ స్కూల్ ఫ్యాకల్టీ, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు, ఐఐఎం ఫ్యాకల్టీ

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



నిత్యకల్యాణంలో తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిపారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

రైల్వే ఆస్పత్రిలో ఆధునిక పరికరాల ప్రారంభం

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే ఆస్పత్రిలో రైల్వే ఉద్యోగులు, సిబ్బంది సౌకర్యార్థం అధునాతన పరికరాలను డీఆర్‌ఎం లలిత్ బోరా గురువారం ప్రారంభించారు. ఫిజియోథెరపీ యూనిట్‌లో ఇథైలిన్ ఆక్సైడ్ స్టెరిలైజర్, అడ్వాన్స్‌డ్ లేజర్ మెషీన్‌లను ఆయన తోపాటు, ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అధునాతన పరికరాల సాయంతో రైల్వే ఉద్యోగులకు మరింత సుఖవంతమైన, శ్రేయస్కరమైన వైద్యసదుపాయాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.శరత్‌బాబు, ఏడీఆర్‌ఎం(ఇన్‌ఫ్రా) ఇ.శాంతారాం, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిజియోథెరపీ యూనిట్‌లో అడ్వాన్స్‌డ్ లేజర్ మెషీన్‌ను ప్రారంభిస్తున్న ఈకార్వో ప్రెసిడెంట్

స్టీల్‌ప్లాంట్ మాజీ ఉద్యోగికి ఏయూటీడీ సేవలు

దాబాగార్డెన్స్: పరవాడ మండలానికి చెందిన బాణాల కృష్ణారావు స్టీల్‌ప్లాంట్‌లో ఏజీఎంగా విధులు నిర్వహిస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. అతని మానసిక ఆరోగ్యం బాగులేక రోడ్డున పడడంతో ద్వారకా పోలీసులు సమాచారం ఇవ్వడంతో ఏయూటీడీ సిబ్బంది అతన్ని ఈ ఏడాది ఫిబ్రవరి 8న జీవీఎంసీ టీఎస్‌ఆర్ షెల్టర్‌లో వసతి కల్పించారు. శ్రద్ధా ఆస్పత్రి అందించిన వైద్యంతో కోలుకున్నారు. తాను వెళ్లిపోతానని గొడవ చేస్తుండడంతో తల్లి బాణాల లక్ష్మిని రప్పించి అప్పగించారు.



తల్లికి కృష్ణారావును అప్పగిస్తున్న ఏయూటీడీ సిబ్బంది

నేరేడు పండు.. పోషకాలు మెండు

- ఆరోగ్య ఫలదాయినిగా గుర్తింపు
- పుష్కలంగా ప్రొటీన్లు, ఖనిజాలు
- స్థానిక మార్కెట్‌లో కిలో రూ.240



అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులో విక్రయిస్తున్న నేరేడు పండ్లు

సీతంపేట: ప్రకృతి ప్రసాదించే పండ్ల జాతుల్లో నేరేడు ఒకటి. ఆరోగ్య ఫల ప్రదాయినిగా పిలిచే నేరేడు పండును సక్రమంగా వినియోగిస్తే ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు శరీరంలో ఏర్పడే కొన్ని అనారోగ్య సమస్యలను కూడా దూరం చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. నేరేడు పండు రుచిలో కూడా మేటిగా ఉంటుంది. నేరేడు పండుతోపాటు ఆకులు, చెట్టుబెరడు కూడా ఆరోగ్యానికి మేలు చేసేవే. నేరేడు పండ్లను కోయడం కొంత కష్టంతో కూడుకున్న పని. అందువల్ల ధర కూడా అధికంగానే ఉంటుంది. సంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానపరంగా అనేక ఔషధ లక్షణాలు కలిగి ఉన్న నేరేడుకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. ప్రస్తుతం నేరేడు పండ్ల సీజన్ ఆరంభమైనందున రోజుకు ఒకటి చొప్పున తిన్నా.. ఆరోగ్యానికి మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

జోరుగా నేరేడు విక్రయాలు

నేరేడు పండ్లు నగర వాసుల నోరూరిస్తున్నాయి. నీలి రంగులో నిఘనిఘలాడుతున్న తాజా పండ్లను ప్రధాన రహదారులపై తోపుడబండ్ల వ్యాపారులు విక్రయిస్తున్నారు. సీజనల్‌గా లభించే ఫలాలు ఆరగిస్తే ఆరోగ్యానికి మంచిదని భావించిన ప్రజలు నేరేడు పండ్లను ఆస్వాదిస్తున్నారు. నియోజకవర్గంలోని అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు, శంకరమఠం రోడ్డు, సీతంపేట, సీతమ్మధార, తాటిచెట్లపాలెం, కంచరపాలెం తదితర ప్రాంతాల్లో నేరేడు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్రతి ఏడాది జూన్, జూలై మాసాల్లో మాత్రమే లభించే ఈ పండ్లకు నగరంలో మంచి గిరాకీ లభిస్తుందని విక్రయదారులు పేర్కొంటున్నారు. మేలోనే సీజన్ ప్రారంభం కావడంతో ప్రస్తుతం ఒడిశా, రాయగడ నుంచి నేరేడు పండ్లను దిగుమతి చేసుకుంటున్నామన్నారు. మరో 10 రోజుల్లో రాష్ట్రంలోని మదనపల్లి నుంచి దిగుమతి ఆరంభమవుతుందని చెప్పారు. రాయగడ పండ్లు కాస్తా చిన్న సైజ్‌లో ఉంటాయని, మదనపల్లి నేరేడు చక్కని సైజ్‌లో నోరూరించేలా దగదగలాడుతాయని చెబుతున్నారు. అర కిలో రూ.120, కిలో రూ.240 చొప్పున పండ్లు విక్రయిస్తున్నట్టు వ్యాపారులు తెలిపారు. ఇప్పటికే నేరేడు కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగిందన్నారు. అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉండే నేరేడు పండ్లను ఏడాదికి ఒకసారైనా ఆరగించాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

ఆరోగ్యపరంగా అనేక ప్రయోజనాలు

- నేరేడు పండ్లలో ఐరన్, కాల్షియం, పొటాషియం తోపాటు ఏ, సీ విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటివల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షణ కలుగుతుంది.
- మూత్ర సమస్యల నియంత్రణతోపాటు మధుమేహం అదుపులో ఉంటుంది. కిడ్నీలను శుభ్రపరుస్తుంది.
- మూత్రాశయంలో ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. కాలేయం పనితీరు మెరుగుపరచడంతోపాటు శుభ్రపరుస్తుంది.
- నేరేడు పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు, మెదడుకు దివ్య ఔషధంగా పనిచేస్తాయి.
- దంతాలు, చిగుళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావం తగ్గుతుంది. నోటిలోని చెడు బాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా చేస్తుంది.
- కడుపులో పేరుకుపోయిన మలినాలు బయటకు పోవడానికి, పేగుల్లో చుట్టుకుపోయిన వెంట్రుకలను కరిగించడానికి నేరేడు పండు దోహదపడుతుంది.
- నేరేడు పండులో విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారిస్తాయి. ఆరోగ్యానికి నేరేడు పండు భరోసా కల్పిస్తుంది.

నియంత్రణ లేకుంటే ఆరోగ్య సమస్యలు

- నేరేడు పండు తినడంలో నియంత్రణ లేకుంటే దుష్ఫలితాలు సంభవించవచ్చు.
- వగరుగా ఉండి నాణ్యత లేని నేరేడు పండ్లు తింటే గొంతు నొప్పి బారిన పడే ప్రమాదముంది.
- సీజన్ మారే సమయంలో నేరేడు పండ్లను మితంగా తినాలి.
- ఉబ్బసం ఉన్న వారు ఈ పండ్లను ఎక్కువగా తినకూడదు. దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలు వచ్చే అవకాశముంది.
- నేరేడు పండ్లలో ఉండే అత్యధిక లవణాలు, పోషకాల వల్ల బలహీనమైన జీర్ణవ్యవస్థ కలిగిన వారికి తరచూ కడుపునొప్పి వచ్చే అవకాశం ఉంది.



నేరేడు పండ్లు



వేతనాలు పెంచాలని మేయర్‌కు వినతి

దాబాగార్డెన్స్: వేతనాలు పెంచాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు గురువారం మేయర్ పీలా శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా ఇంజినీరింగ్ విభాగంతో పాటు ఇతర ఉన్నతాధికారుల వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు విధులు సక్రమంగా నిర్వహిస్తూ, ఏ అధికారికి ఎటువంటి ఆటంకం కలగకుండా పని చేస్తున్న తమకు ఎటువంటి గుర్తింపు లేదని, జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ డ్రైవర్లు, వర్కర్లకు వేతనాలు పెరిగాయని, వారితో సమానంగా రూ.24,500 పెంచేలా చర్యలు చేపట్టాలని ఆ వినతిలో పేర్కొన్నారు. మేయర్ స్పందిస్తూ న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు తెలిపారు.



వినతి పత్రం అందజేస్తున్న ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు

ముగిసిన విశ్వేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు



అన్నదానం చేస్తున్న పలు దేవాలయాల ఈవోలు

దాబాగార్డెన్స్: సూర్యాబాగ్ మెయిన్‌రోడ్డులో వెలసిన విశ్వేశ్వరస్వామి ఆలయంలో గత ఆరు రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక కల్యాణోత్సవాలు గురువారంతో ముగిసాయి. ముగింపును పురస్కరించుకుని మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్లు అడపా దేముళ్లు, దేవదాయ శాఖ ఈవోలు కీర్తి శ్రీనివాసరావు, బొంగరాల మురళీమోహన్‌రావు, దేవస్థానం ప్రధాన అర్చకుడు బాదంపూడి విశ్వేశ్వరశర్మ, భక్తులు పాల్గొన్నారు. పుష్పాంజలి సేవతో ఉత్సవాలు ముగిసాయి.